## ఘనంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం, జనవరి 30: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దివ్యక్షేత్రంలో మంగళవారం సీతారాముల నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, తదితర నిత్య పూజలను నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి సంప్రదాయబద్ధంగా నిత్య కల్యాణం జరిపించారు.

## ప్రకృతి రైతులకు మంత్రి తుమ్మల అభినందనలు


రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

అశ్వారావుపేట రూరల్, జనవరి 30: మల్లాయిగూడెం గ్రామ పంచాయతీలోని మల్లాయిగూడెం, దిబ్బగూడెం రైతులను వ్యవసాయ మార్కెటింగ్, గిడ్డంగులశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. హైదరాబాద్‌లోని నాబార్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. స్టాల్ ఏర్పాటు చేసిన మల్లాయిగూడెం రైతు, మాజీ సర్పంచ్ దారా ప్రసాద్‌తో మాట్లాడుతూ జీవ ప్రాజెక్టు ద్వారా సాగు విధానంపై ఆరా తీశారు. నాబార్డు సీజీఎం సుశీల చింతల, అధికారులు, ఆర్‌పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వామిత్ర, రాజశేఖర్‌కు సన్మానం


రాజశేఖర్‌ను సన్మానిస్తున్న పద్మశ్రీ రామయ్య దంపతులు

చుంచుపల్లి, జనవరి 30: పర్యావరణ పరిరక్షణలో భాగంగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్న చిన్నారి విశ్వామిత్ర చౌహాన్‌ను, ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకుడు ముక్కల రాజశేఖర్‌ను పద్మశ్రీ వనజీవి రామయ్య తన ఇంటికి ఆహ్వానించారు. ఖమ్మంలోని ఆయన నివాసంలో మంగళవారం వారిని శాలువాలతో సన్మానించారు.

## పెండింగ్ ఫైళ్లను క్లియరెన్స్ చేయాలి

భద్రాచలం, జనవరి 30: వచ్చేనెలలో జరుగబోయే ఐటీడీఏ పాలకవర్గ సమావేశానికి ఎటువంటి అవకాశం, లోటుపాట్లు లేకుండా సంబంధిత అధికారులు పెండింగ్ ఫైళ్లను క్లియరెన్స్ చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదేశించారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గ సమావేశంలో రాష్ట్ర మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు, ఇతర రాజకీయ ప్రతినిధులు, కలెక్టర్, వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు.

## పర్యావరణ సదస్సులు నిర్వహించాలి: డీఈవో

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 30: జిల్లాలోని అన్ని పాఠశాలల్లోనూ మాదిరి పర్యావరణ సదస్సులను నిర్వహించాలని డీఈవో వెంకటేశ్వరాచారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందు కోసం సమ్మక్క–సారక్క జాతరపై వీటిని నిర్వహించాలని తెలిపారు.

## 'కలకోటి'కి మాజీ ఎమ్మెల్యే నివాళి

అశ్వారావుపేట, జనవరి 30 : బీఆర్ఎస్ నాయకుడు కలకోటి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తండ్రి సుబ్బారావు మంగళవారం మృతిచెందారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కలకోటి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి సుబ్బారావు మృతికి సంతాపం ప్రకటించారు.

## ఓసీ ప్రభావిత గ్రామాల్లో సింగరేణి జీఎం పర్యటన

రామవరం, జనవరి 30: కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు సత్తుపల్లి కిష్టారం ఓసీ ప్రభావిత గ్రామాలైన కిష్టారం, అంబేద్కర్ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ప్రభావిత గ్రామాల ప్రజలను వ్యక్తిగతంగా కలిసి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కిష్టారం గ్రామపెద్దలు అప్పారావు, ఓ.రాజు, రేణుకలతో కలిసి ప్రభుత్వ పాఠశాల, కమ్యూనిటీ హాల్, గ్రంథాలయాలను సందర్శించారు.

## పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

పినపాక, జనవరి 30: పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మణుగూరు ఏడీఏ తాతారావు అన్నారు. ఆయన మంగళవారం టేకొత్తగూడెం పంచాయతీ పరిధిలోని వీరాపురం గ్రామంలో పర్యటించి పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. రైతులందరూ తాము సాగు చేస్తున్న పంటలు సర్వే నెంబర్, విస్తీర్ణంతో సహా వ్యవసాయ శాఖ అధికారులు వద్ద నమోదు చేసుకోవాలన్నారు.

## విద్యార్థులకు రుచికరమైన ఆహారం వడ్డించాలి

భద్రాచలం, జనవరి 30 : గిరిజన విద్యార్థులకు ఇంటి భోజనాన్ని మరిపించేలా మెనూ ప్రకారం రుచికరమైన ఆహార పదార్థాలను వడ్డించాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ అన్నారు. ఐటీడీఏ పక్కన గిరిజన భవనంలో రుచికరమైన ఆహార పదార్థాల తయారీ, పరిశుభ్రతపై రెండ్రోజుల శిక్షణ నిర్వహించారు. మంగళవారం ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలపై నమ్మకంతో పిల్లలను ఇక్కడకు పంపిస్తారని, వారికి చదువుతోపాటు రుచికరమైన భోజనం అందించాలన్నారు.

# మహనీయుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలి


కొత్తగూడెం : స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు


కొత్తగూడెం క్రైం : నివాళులర్పిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు


భద్రాచలం : నివాళి అర్పిస్తున్న పీవో ప్రతీక్ జైన్


పినపాక ఎంపీడీవో కార్యాలయంలో..


అశ్వారావుపేట టౌన్ : మండల పరిషత్‌లో..


పాల్వంచ రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో..

వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రజా సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో జాతిపిత వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఐడీవోసీలో జరిగిన గాంధీ వర్ధంతి వేడుకలకు భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల హాజరయ్యారు. అమరుల సంస్మరణార్థం అన్ని శాఖల అధికారులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహనీయుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది మౌనం పాటించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో పీవో ప్రతీక్ జైన్ అన్ని శాఖల యూనిట్ అధికారులు, సిబ్బందితో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పార్టీలు, ప్రజా సంఘాల బాధ్యులు తమ ప్రాంతాల్లోని మహాత్ముడి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో బాపూజీ పాత్రను గుర్తు చేసుకున్నారు. – నెట్‌వర్క్

# చంద్రుగొండలో ఎలుగుబంటి హల్‌చల్

రెండు రోజుల్లో ఇద్దరిపై దాడి
ఆందోళన చెందుతున్న మండల ప్రజలు

చంద్రుగొండ, జనవరి 30: దారితప్పిన ఎలుగుబంటి రెండు రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. మద్దుకూరులో వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి నల్లమోతు రామారావుపై దాడి చేసి 24 గంటలు గడవకముందే మంగళవారం చంద్రుగొండలోని అంబేద్కర్ కాలనీలో కంచర్ల తిరుపతి ఇంట్లోకి చొరబడింది. తిరుపతి ఇంటి ఆవరణ నుంచి బయటకు వస్తుండగా ఒక్కసారిగా అతడి కాళ్లపై దాడి చేసింది. బాధితుడు వెంటనే తేరుకొని అరవడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమయ్యారు. దీంతో ఎలుగుబంటి అక్కడి నుంచి పొలాల్లోకి పారిపోయింది. బాధితుడిని కుటుంబ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ రేంజర్ ఆస్పత్రికి వెళ్లి తిరుపతిని పరామర్శించారు. అనంతరం అటవీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు పరిస్థితిపై సమీక్షించారు. ప్రజలు భయపడాల్సిన పనిలేదని, ఎలుగుబంటిని త్వరలోనే పట్టుకుంటామని, నాలుగు బృందాలుగా విడిపోయి గాలిస్తున్నామని ఎఫ్‌డీవో కోటేశ్వరరావు తెలిపారు. రెండు రోజుల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తులకు అటవీ శాఖ నిబంధనల ప్రకారం వైద్య ఖర్చులు చెల్లిస్తామన్నారు. దారితప్పిన ఎలుగుబంటి గ్రామాల్లోకి వచ్చిందని, రాత్రి వేళల్లో కచ్చితంగా మళ్లీ అది అడవిలోకి వెళ్తుందన్నారు. తహసీల్దార్ సాజియాసుల్తాన, ఎస్సై మాచినేని రవి ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన కల్పించారు.


శివారు ప్రాంతాల్లో వెతుకుతున్న అటవీశాఖ ఎఫ్‌డీవో కోటేశ్వరరావు, సిబ్బంది

# రుణాల పేరుతో అక్రమ దందా..?

గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రత్యేక బృందం
ఒక్కొక్కరి నుంచి రూ.600 వసూళ్లు
బంధువులు, పరిచయస్తులే టార్గెట్


మద్దికొండ గ్రామంలో వసూళ్ల ముఠా

అశ్వారావుపేట, జనవరి 30: బంధువులు, పరిచయస్తులు లక్ష్యంగా ఒక ముఠా రుణాల మంజూరు పేరుతో అక్రమ దందాకు పాల్పడుతున్నది. గ్రామాల్లో పర్యటిస్తూ ఒక్కొక్కరి నుంచి ఖర్చులు అవుతున్నాయంటూ రూ.600 చొప్పున వసూలు చేస్తున్నది. వివరాల్లోకి వెళితే.. ములకలపల్లి, పాల్వంచ మండలాలకు చెందిన రత్న, చంద్రశేఖర్, పాషా బృందంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం విశ్వకర్మ పథకం కింద రూ.లక్ష రుణం మంజూరు కోసం దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తామంటూ గ్రామాల్లో పర్యటిస్తున్నది. ఆన్‌లైన్ చేసిన తర్వాత నెంబర్ వేసిన దరఖాస్తును ఆశావహులకు ఇస్తు ఖర్చుల నిమిత్తం రూ.600 చొప్పున వసూలు చేస్తున్నది. అశ్వారావుపేట మండలం మద్దికొండలో స్థానికుల నుంచి ఇలాగే వసూళ్లు చేస్తుండగా అనుమానం వచ్చి 'నమస్తే తెలంగాణ'కు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న 'నమస్తే' రిపోర్టర్ సదరు బృందం సభ్యులను ప్రశ్నించగా అధికారిక అనుమతి లేదని, బంధువులు, పరిచయస్తులకు ఇబ్బంది లేకుండా తామే పీఎం రుణం మంజూరు కోసం దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్నామంటూ రత్న సమాధానం ఇస్తూనే అక్కడ నుండి వెళ్లిపోయారు. కొన్ని రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో బృందం పర్యటిస్తున్నట్లు సమాచారం. ఆటోలో వచ్చిన ఆశావహులను నమ్మించేందుకు వెంట తీసుకొచ్చిన ల్యాప్‌టాప్‌లో దరఖాస్తును ఆన్‌లైన్ చేసి దానిపై ఒక నెంబర్ వేసి ఇస్తున్నారు. ముఠా సభ్యులు ములకలపల్లి మండలం మొగరాలగుప్ప, పాల్వంచ మండలం నాగారంనకు చెందిన వ్యక్తులుగా తెలిసింది. ఈజీ మనీ కోసం కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి, ప్రభుత్వ పథకాల కింద సబ్సిడీ రుణాలు మంజూరు అవుతాయని ఆశ చూపి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. దీనిపై ఎంపీడీవో జి.శ్రీనివాసరావును వివరణ కోరగా తాము ఎవరికీ రుణ మంజూరు కోసం దరఖాస్తులు తీసుకోమని అనుమతి ఇవ్వలేదని బదులిచ్చారు. ప్రభుత్వ రుణాల కోసం అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలే తప్ప మధ్యవర్తులను ఆశ్రయిస్తే ప్రజలు నష్టపోతారని స్పష్టం చేశారు.

# 2.52 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు

మొత్తం 9,057 మంది రైతులకు రూ.146.06 కోట్ల చెల్లింపులు
సీసీఐ అధికారులు, వ్యాపారుల సమావేశంలో అదనపు కలెక్టర్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

కొత్తగూడెం టౌన్, జనవరి 30: సీసీఐ జిల్లా రైతుల నుంచి ఇప్పటి వరకు 2,52,812 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సీసీఐ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంజిత్ కాటన్ మిల్ ద్వారా 4,246 మంది రైతుల వద్ద 1,04,019 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని, ఆ రైతులకు రూ.61.43 కోట్లు చెల్లించామని, అనుశ్రీ ఇండస్ట్రీస్ ద్వారా 1,870 మంది రైతుల నుంచి 61,367 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని, వారికి రూ.33.67 కోట్లు చెల్లించామని, శ్రీసీతారామ జిన్నింగ్ మిల్ ద్వారా 1,628 మంది రైతుల నుంచి 54,701 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని, వారికి రూ.30.27 కోట్లు చెల్లించామని, శ్రీలక్ష్మీ ప్రియ కోటెక్స్ ద్వారా 1,313 మంది రైతుల నుంచి 32,725 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని, వారికి రూ.20.69 కోట్లు చెల్లించామని వివరించారు. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 9,057 మంది రైతుల వద్ద నుంచి 2,52,812 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని, ఆయా రైతులకు రూ.146.06 కోట్ల చెల్లింపులు చేశామని వివరించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ ఆలీం, డీఏవో అభిమన్యుడు, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

### జంతువుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: ఏసీ

జంతువులను సంరక్షిస్తూ వాటి మనుగడకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అదనపు కలెక్టర్ (ఏసీ) రాంబాబు పేర్కొన్నారు. పశు సంవర్ధక, మార్కెటింగ్, పంచాయతీరాజ్, విద్య, సమాచార శాఖల అధికారులు, జంతు హింస నివారణ కమిటీ సభ్యులతో కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవాల సంరక్షణ, మనుగడపై ప్రజలకు అవగాహన కల్పించేందు కోసం ఈ నెల 14 నుంచి 30 వరకు జంతు సంరక్షణ పక్షోత్సవాలను నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా పశు వైద్య, సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన రావులపల్లి

భద్రాచలం, జనవరి 30 : ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రోహిత్‌రాజ్‌ను మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు రావులపల్లి రాంప్రసాద్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

## డీఎంహెచ్‌వో అవినీతిపై విచారణ చేపట్టండి


డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గుగులోత్ రాజేష్‌నాయక్, ప్రకాష్ రాథోడ్

సుల్తాన్‌బజార్, జనవరి 30 : డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని నంగారా భేరి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేశ్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్‌ను ఆయన వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాశ్ రాథోడ్‌తో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో భద్రాచలంలో అడిషనల్ డీఎంహెచ్‌వో(ట్రైబల్)గా పని చేసిన సమయంలో శిరీష అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కేశవ్‌నాయక్, సింగరేణి ఉమ్మడి జిల్లా ఇంచార్జి నందునాయక్, నాయకులు సురేశ్‌నాయక్, రాందాస్‌నాయక్, అశోక్‌నాయక్, ప్రేమ్‌నాయక్, కిశోర్ నాయక్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర

అశ్వారావుపేట టౌన్, జనవరి 30: గ్రామాభివృద్ధిలో సర్పంచ్ కీలక పాత్రతో పాటు పాలక సభ్యులదేనని పార్టీలకు అతీతంగా ప్రజాపాలన సాగిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు నడిచారని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జడ్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మి, తహసీల్దార్ కృష్ణప్రసాద్ అన్నారు. పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

సారపాక, జనవరి 30: మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు సర్పంచ్, పాలకవర్గాన్ని పంచాయతీ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. పాలకవర్గ సభ్యులు, పంచాయతీ, పారిశుధ్య సిబ్బందికి సర్పంచ్ తేనేటివిందు ఇచ్చి వీడ్కోలు పలికారు.

ములకలపల్లి, జనవరి 30 : గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల ఐదేళ్ల పాలన ఫిబ్రవరి 1వ తేదీతో ముగియనుండడంతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీను, ఎంపీవో లక్ష్మయ్య, ఎంపీపీ మట్ల నాగమణి సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను సన్మానించారు.

## కుష్ఠువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

అన్నపురెడ్డిపల్లి, జనవరి 30 : కుష్ఠు వ్యాధి రహిత సమాజం కోసం కృషి చేయాలని వైద్యాధికారి ప్రియాంక పిలుపు నిచ్చారు. ఎర్రగుంట ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది కుష్టు నివారణపై అవగాహన కల్పించారు.

చంద్రుగొండ మండలం మద్దుకూరు పంచాయితీ కార్యాలయంలో, దమ్మపేట పంచాయతీ కార్యాలయంలో, బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆసుపత్రిలో మంగళవారం కుష్ఠువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాల్వంచ రూరల్‌లోని జగన్నాథపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజు అవగాహన కల్పించారు.

## గంజాయి పట్టివేత

38 కేజీలు స్వాధీనం : నలుగురు నిందితుల అరెస్ట్

అశ్వారావుపేట, జనవరి 30 : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 38 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ నాగయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం రాజేపల్లి గ్రామానికి చెందిన ముంతోజు స్వరూప, దారా బాబు, కోదారి నిర్మల, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన చామకూరి మాధవి తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో మంగళవారం గంజాయి కొనుగోలు చేసి కాకినాడ నుండి సిరిసిల్ల వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఖమ్మంలో దిగి అక్కడ రైలు ద్వారా హైదరాబాద్ చేరుకుని విక్రయదారులకు అప్పగించాలని నిందితులు ముందుగా ప్లాన్ చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద సీఐ నాగయ్య పర్యవేక్షణలో అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రత్యేక బృందాలు తనిఖీ చేస్తున్నాయి. తనిఖీ చేసేందుకు ఆర్టీసీ బస్సు నిలుపుదల చేస్తుండగా గమనించిన నిందితులు బస్సు దిగి పారిపోబోగా ఎక్సైజ్ బృందాలు అప్రమత్తమై వెంబడించి పట్టుకున్నాయి. వారిని తనిఖీ చేయగా లగేజీ బ్యాగుల్లో 38 కేజీల గంజాయి ప్యాకెట్ల లభించాయి. నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగయ్య తెలిపారు.

## సంక్షిప్తం

### 'విద్యుత్ భద్రత'పై అవగాహన

ఇల్లెందు రూరల్, జనవరి 30: స్థానిక వైసీవోఏ క్లబ్‌లో ఏరియాలోని అధికారులకు, సూపర్‌వైజర్లకు, ట్రేడ్ పర్సన్లకు ఏరియా జీఎం ఆనంద్ అధ్యక్షతన మంగళవారం విద్యుత్ భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్‌వైజర్లు, అధికారులు పని ప్రారంభించే ముందు పని గురించి తెలిసి ఉండాలని, ల్యాగౌట్, ట్యాగ్ అవుట్ సిస్టంను పాటించాలన్నారు. పని పూర్తయ్యేవరకు వేరే పనులు చేయవద్దన్నారు.

### ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

ఇల్లెందు,రూరల్ జనవరి 30: సింగరేణిలో కార్మికులు యాజమాన్యం అందించే ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సింగరేణి ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. మంగళవారం ఇల్లెందు ఏరియాలోని ఎంవీటీసీలో 'మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, తదితర వాటిపై జీఎం అవగాహన కల్పించారు. మల్లయ్య, శివప్రసాద్, గిరిధర్‌రావు, వెంకటేశ్వర్లు, ప్రహ్లాద్, మోహన్‌రావు పాల్గొన్నారు.

### సీతమ్మసాగర్ నిర్వాసితుల భూములు పరిశీలన

మణుగూరుటౌన్, జనవరి 30: మండలంలోని రామానుజవరం గోదావరి తీరప్రాంతంలో సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితుల భూములను తహసీల్దార్ రాఘవరెడ్డితో కలిసి భూసేకరణ అధికారి(ఆర్డీవో) మంగీలాల్ మంగళవారం పరిశీలించారు. నిర్వాసితులు అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అధికారులు భూములను పరిశీలించారు.

### డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం

పాల్వంచ రూరల్, జనవరి 30: డీసీఎంఎస్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కొత్వాల శ్రీనివాసరావును పాల్వంచ సొసైటీ పాలకవర్గ బాధ్యులు మంగళవారం పాల్వంచలోని తమ కార్యాలయంలో సన్మానించారు.

### పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

చుంచుపల్లి, జనవరి 30: పారిశుధ్య పనులపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీవో గుంటి సత్యనారాయణ సూచించారు. మండలంలోని విద్యానగర్ కాలనీ, ధన్బాద్ పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతీరోజు పారిశుధ్య పనులు చేట్టాలని పెట్టాలని సూచించారు.

### తేనెటీగల దాడిలో మహిళ మృతి

పినపాక, జనవరి 30: తేనెటీగల దాడిలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని అమరవరం పంచాయతీ కొత్తూరులో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొగ్గలి రవీందర్ తన బైక్‌పై భార్య సూర్యకాంతం (30), ఇద్దరు కూతుర్లను ఎక్కించుకుని ఆధార్ అప్‌డేట్ కోసం అమరవరం వెళ్తున్నాడు. మార్గమధ్యంలో ఓ చెట్టుపై నుంచి తేనెటీగలు ఒక్కసారిగా వీరిపై దాడిచేశాయి. తేనెటీగల దాడిలో సూర్యకాంతం తీవ్ర అస్వస్థతకు గురికాగా పినపాక పీహెచ్‌సీకి అక్కడ నుంచి మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సూర్యకాంతం మృతిచెందింది. గాయపడిన రవీందర్, ఇద్దరు చిన్నారులు ప్రాణాలతో బయటపడ్డారు.

### చికిత్స పొందుతూ రైతు మృతి

జూలూరుపాడు, జనవరి 30: దుక్కిటెడ్లకు మేత వేస్తుండగా వాటిల్లో ఒకటి రైతును పొడవడంతో అతడు మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దుబ్బతండాకు చెందిన బానోత్ వాళియా (55) తన ఇంటి వద్ద కట్టేసి ఉన్న దుక్కిటెడ్లకు ఈ నెల 27న మేత వేస్తున్న క్రమంలో ఒక ఎద్దు పొడిచింది. దీంతో అతడు పక్కనే ఉన్న కాలువలో పడగా తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఇరుగు జీవన్‌రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

జూలూరుపాడు, జనవరి 30: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టగా త్రుటిలో ప్రమాదం తప్పిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకున్నది. ప్రయాణికుల కథనం ప్రకారం.. సీతారామ ప్రాజెక్టు కాల్వ పనులు చేపడుతున్న ప్రాంతంలో ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లను నిర్మించారు. ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. స్పీడ్ బ్రేకర్ల వద్ద వేగాన్ని తగ్గించింది. వెనుకనే వస్తున్న ఓ లారీ వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కిరాణా షాపుల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీ

టేకులపల్లి, జనవరి 30: ఎక్సైజ్‌శాఖ సీఐ రాంప్రసాద్ ఆదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖ ఎస్సై రమాదేవి టేకులపల్లిలోని కిరాణా షాపుల్లో మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రమాదేవి మాట్లాడుతూ.. నాటు సారా అమ్మినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అన్నపురెడ్డిపల్లి, జనవరి 30: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కట్టుగూడెం గ్రామానికి చెందిన ఆవుల శివప్రసాద్ చంద్రుగొండ వైపు నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా గుంటూరు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న కారు కట్టుగూడెం మూల మలుపు వద్ద బైక్‌ను ఢీకొట్టింది. అదుపు తప్పి రహదారి పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న కృష్ణారావుకు, ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108లో కొత్తగూడెం వైద్యశాలకు తరలించారు. ఎస్సై షాహీనా దర్యాప్తు చేపట్టారు.

### ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

భద్రాచలం, జనవరి 30: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ట్రాఫిక్ రూల్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

### సీహెచ్‌సీలో 24 గంటలూ వైద్యసేవలు

బూర్గంపహాడ్, జనవరి 30 : బూర్గంపహాడ్ సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో 24గంటలపాటు స్పెషలిస్ట్ వైద్యులతో రోగులకు వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎన్.షైలేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. సీహెచ్‌సీలో ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు, దంత వైద్యనిపుణులు, మత్తు వైద్యనిపుణులు, షుగర్‌వ్యాధి నిపుణులు, జనరల్ సర్జన్(శస్త్రచికిత్స), చిన్నపిల్లల వైద్యనిపుణులు, జనరల్ ఫిజీషియన్ అందుబాటులో ఉన్నారని తెలిపారు.

### వ్యక్తి ఆత్మహత్య

సారపాక, జనవరి 30 : మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి మద్యంమత్తులో ఆత్మహత్య చేసుకున్న ఘటన సారపాకలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు మండలం సుదిమళ్లకు చెందిన నర్సయ్య(47) సోమవారం పొలానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అయితే సారపాక ప్రధాన కూడలి సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి అక్కడి నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### కొల్లు శ్రీనివాసరెడ్డికి నివాళి

అశ్వాపురం, జనవరి 30 : దోపిడీరహిత సమాజ నిర్మాణమే అమరజీవి కొల్లు శ్రీనివాసరెడ్డికి మనమిచ్చే నివాళి అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మొండికుంటలో సీపీఐ కార్యాలయం వద్ద శ్రీనివాసరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు.

### పంచాయతీ నిర్మాణ పనుల పరిశీలన

దుమ్ముగూడెం, జనవరి 30: మండలంలోని డబ్ల్యూఎల్ రేగుబల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణ పనులను సొసైటీ డైరెక్టర్ కాలువ పూర్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు దామెర్ల శ్రీను, కార్యదర్శి రోహిణి మంగళవారం పరిశీలించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.20 లక్షలతో పనులు జరుగుతున్నాయని తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

అశ్వాపురం, జనవరి 30: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని జగ్గారంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకున్నది. బూర్గంపహాడ్ గ్రామానికి చెందిన కొండా శ్రీను బండిపై ఐస్‌క్రీం అమ్ముతూ ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో శ్రీనుకు తీవ్రగాయాలు కావడంతో మణుగూరు ఆసుపత్రికి తరలించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319428-All

INDUSIND BANK LTD.
COMMERCIAL VEHICLE FOR SALE
1).TS28TA8841 MAXIMA CARGO-2022
2).TS28TA9582 BAJAJ RE CNG-2022
3).TS28TA7325 APE LD- 2021
4). TS28TA9769 BAJAJ RE CNG-2022
5).TS28TA9805-BAJAJ RE DIESEL -2022
Cell:7337394783
H.No. 6-8-100, 2nd Floor, KNR Mansion, Ganesh Basthi, Kothagudem, Bhadradri Kothagudem Dist.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616